
## పురుషులకు ప్రత్యేకం

# మూడోతరం

**- ఎ. ఎస్. రాజశేఖర్**



ఉదయం పదిన్నర.

"ఏం శారదమ్మా! ఏం చేస్తున్నావ్? మీ ఆయన ఆఫీసుకెళ్ళినా ఇంకా తీరిక కాలేదా!" లోపలికి వస్తూ అంది కామాక్షి.

"ఇదిగో వస్తున్నా వదినా! మా అత్తగారికి ఈవేళప్పుడు మందు ఇమ్మన్నారు మావారు. నువ్వు మనవాళ్ళెవరైనా వస్తే మాట్లాడుతూ వుండు. నేను వచ్చేస్తాను" లోపలినుండే చెప్పింది శారదమ్మ.

శారదమ్మకు ఇద్దరు పిల్లలు. పెద్దది గాయత్రికి పెళ్ళిచేసి పంపారు. కొడుకు నరేష్ బ్యాంక్‌లోక్లర్క్. భర్త రాజేశ్వర్రావ్ ఒక సంవత్సరంలో వుద్యోగంనుండి రిటైర్ అవుతాడు. రాజేశ్వర్రావ్ తల్లి సుభద్రమ్మ.

సుభద్రమ్మకు ఆరోగ్యం మొన్నమొన్నటి వరకూ బాగానే వుండేది. గతకొద్దికాలంగా వుబ్బసం మొదలైంది. ఇదీ క్లుప్తంగా శారదమ్మ కుటుంబం.

"పిన్నీ! మావారు క్యాంప్‌నుండి ఈ చీర తెచ్చారు. బావుందా!" లోపలికి దూసుకురాబోతూ వరండాలో వున్న కామాక్షమ్మను చూసి ఆగిపోయింది కల్పన.

"నీకేమే! పెట్టిపుట్టావ్. నీమాట కాదంటాడా నీమొగుడు. ఎంతట?" చేతిలోకి చీర తీస్కొంటూ అడిగింది కామాక్షమ్మ.

"మూడొందలట పిన్నీ. ఫారిన్ శారీ" కల్పన గర్వంగా చెబుతుండగా లక్ష్మి సుమిత్రమ్మ లలితమ్మ ప్రవేశించారు.

వారంతా అదే కాంపౌడ్‌లో వుంటున్నారు. అందరూ భర్తలను ఆఫీసులకు పంపాక, శారదమ్మ ఇంటిలో చేరి కబుర్లాడటం ఆనవాయితీ.

"ఏమిటే క్రొత్తచీర తెచ్చినట్టున్నావ్". ఆసక్తిగా అడిగింది లక్ష్మి.

"ఔను! శారదమ్మ ఏది?"

"ఆ..అత్తగారికి ఆస్తమా తగ్గేంతవరకు శారదమ్మకు పని తీరదు."

లోపలున్న శారదమ్మకు ఈ మాటలన్నీ వినబడు తూనే వున్నాయి. అత్తగారికి మందిచ్చి, నీళ్ళు ప్రక్కనే పెట్టి వరండాలోకొచ్చింది.

"వచ్చావా పిన్నీ! మన వీధిలో తన మొగుడికొక్కడికే స్కూటరుంది అని మిడిసిపడే ఆ సుప్రియ లేదూ! దాన్ని మొగుడు తన్ని తగలేశాడు. పుట్టింటికెళ్ళింది. ఈరోజు ఉదయాన్నే వెళుతుండగా నేను చూసాను. వాళ్ళ పనిమనిషి కూడా చెప్పింది." హాట్ న్యూస్ చెప్పింది లక్ష్మి.

"ఏమిటేమిటి?" అందరూ ముక్తకంఠంతో ఆశ్చర్యం ప్రకటించారు.

కానీ ఆ సుప్రియ వెళ్ళింది నిజంగా పుట్టింటికే అయినా భర్త తన్ని తగలేసి కాదు. చెల్లెలు సీమంతానికని వుత్తరంవస్తే వెళ్ళింది. వీళ్ళేమో ఆ విషయానికి 'మసిపూసి మారేడుకాయ' చేస్తున్నారు. కారణం వీరికె వ్వరి యిళ్ళల్లోనూ లేని స్కూటర్. అంతే.

ఆ విషయం గురించే అందరూ రకరకలుగా మాట్లా డుకొన్నారు. ఆ తర్వాత టాపిక్ తిరిగి చీరలమీదకి మళ్ళింది.

"మావారు రెండు తెచ్చారిలాంటివే. నువ్వు తీస్కో పిన్నీ! ఈ చీరలో అచ్చు సినీస్టార్ శారదలానే వుంటావ్" చెప్పింది కల్పన.

"వద్దులేమ్మా! ఈ నెల మధ్యలో చీర కొనలేను." నవ్వుతూ తిరస్కరించింది శారదమ్మ.

"మరీ అంత బీద అరుపులు అరుస్తావేం? లక్షణంగా కొడుక్కూడా బ్యాంక్‌లో వుద్యోగం చేస్తున్నాడు. తీస్కోకూడదూ! అంది కామాక్షమ్మ.

"వద్దు. ఈనెల చాలా ఖర్చులున్నాయి" అంది శారదమ్మ.

ఆ తర్వాత సంభాషణ సినిమాలమీదకు మళ్ళింది.

"ఆడదే ఆధారం" బాగుందట. నేను మ్యాట్నీకు వెళదామనుకొంటున్నాను" చెప్పింది వందన.

అంతే చకచకా తర్జన, భర్జనలు సాగాయి. మ్యాట్నీకి వెళ్ళేందుకు శారదమ్మ, కామాక్షమ్మ తప్ప అందరూ 'ఓకే' అని లేచారు.

"నేనంటే ఈ సాయంత్రమే యాత్రలకు బయల్దేరు తున్నా కదాని సినిమాకు వెళ్ళడంలేదు. నీకేం?" అడి గింది కామాక్షమ్మ.

"ఎక్కడ వదినా! తీరికే లేదు. సరిగ్గా ఆ టైమ్‌కు మా అత్తగారికి భోజనం వడ్డించాలి. మళ్ళీ మందులు. కుదరదు" చెప్పింది.

"నీకు తిక్కబట్టి అన్నీ ఇలా అమర్చి అత్తగారికి అడుగులకు మడుగులొత్తుతున్నావ్. నీకు కోడలు వచ్చినా నువ్విలాగే చేస్తుంటే మీ అత్తగారు అన్నీ సుఖంగా జరిపించుకొంటునే వుంటుంది." వ్యంగ్యంగా అంది కామాక్షమ్మ.

ఏం మాట్లాడలేదు శారదమ్మ.

"అసలు ఇన్నేళ్ళలో నువ్వు ఏం అనుభవించావ్. జీవితంలో మావాళ్ళందరితో పాటూ కాశీతో సహా ఉత్తరదేశ యాత్రకు రమ్మంటే "అమ్మో! నేను లేకపోతే మా అత్తయ్యకు ఇబ్బంది" అన్నావ్.

"చీర కొనుక్కోమంటే వద్దన్నావ్. అఖరుకు సినిమాకు రమ్మన్నా అత్తగారన్నావ్. "ఏదో ఉపోద్ఘాతంలా అంది కామాక్షమ్మ.

"మరేం చెయ్యమంటావ్?" అడిగింది శారదమ్మ.

"అదే నేను చెప్పబోయేది. మన ఊరిలో అనాథ శరణాలయం వుంది కదా! అందులో మీ అత్తయ్యలాంటి వారందర్నీ ఫ్రీగా చేర్చుకుంటున్నారు అని మొన్న ప్రక్కవీధి సుకన్య చెప్పింది. అక్కడికి పంపేయి మీ అత్తను. కావాలంటే ప్రతి ఆదివారం నీ కొడుకు వెళ్ళి చూసి రావచ్చు. ఎలాగు మీ నరేష్ అంటే మీఅత్తకు ఇష్టం కదా!" చెప్పి లేచింది కామాక్షమ్మ.

అదీ ప్రారంభం. చెడు తలంపు అనేది రాకూడదు. వచ్చాక ఆపడం ఎవరి తరమూ కాదు. కామాక్షమ్మ ఆ విషయం చెప్పినప్పటినుండీ సుభద్రమ్మను నిర్లక్ష్యం చేయసాగింది శారదమ్మ.

"మంచినీళ్ళు శారదా!" అని తన గదిలోనుండి అరుస్తున్నా వినబడనట్లు నటించేది. వేళకు మందులి చ్చేది కాదు.

ఆ తరువాత కొన్నాళ్ళకు భర్త రాజేశ్వర్రావ్‌ను ఒప్పించింది. కొడుకు ఏదో క్యాంప్‌కెళ్ళినప్పుడు సుభద్రమ్మ ఏడ్చి మొత్తుకుంటున్నా వినకుండా తీస్కెళ్ళి అనాథ శరణాలయంలో చేర్పించింది.

ఆ తర్వాత వచ్చిన నరేష్‌కు "నానమ్మను మన దగ్గర బంధువు బలవంతం చేసి మరీ తన వూరికి తీస్కెళ్ళాడు" అని అబద్ధం చెప్పి వూపిరి తీస్కొంది.

* * *   * * *

ఓ నెలరోజులు గడిచాక.

"నాన్నా! వీటి మీద నువ్వు, అమ్మా సంతకం చేయండి" అంటూ రెండు పేపర్లు అందించాడు నరేష్.

"ఎందుకురా! మీ నాన్నగారు రిటైరయ్యాక ఇల్లు కట్టుకొనేందుకు లోనా?" అక్కడే బియ్యం చెరుగుతున్న శారదమ్మ అడిగింది.

"కాదమ్మా! ఎలాగు నాన్న ఈ సంవత్సరంలో రిటైర్ అవుతారు కదా! మిమ్మల్నిద్దరినీ 'హోమ్ ఫర్ ది ఏజ్డ్' అంటే మన వూరి చివరనున్న వృద్ధ శరణాలయానికి పంపుదామని" తాపీగా చెప్పాడు నరేష్.

న్యూట్రాన్ బాంబు నెత్తిమీద పడ్డట్లు ఫీలైంది శారదమ్మ.

"ఏమిట్రా ఇది?" మాటలు తడబడుతుండగా అడిగాడు రాజేశ్వర్రావ్.

"ఒరేయ్ నీకిదేం మాయరోగంరా! నవమాసాలు మోసి, కన్నానురా! ఒక్కడే కొడుకని నిన్ను గారాబంగా పెంచినందుకు బాగానే—చేస్తున్నావ్" రుద్ధకంఠంతో అంది.

"నాన్నమ్మకు. మన నాన్నకూడా ఒక్కడే కదమ్మా!" బులెట్‌లా వచ్చింది నరేష్ నోటివెంట.

ఈసారి నిజంగానే గుండెలదిరాయి శారదమ్మకు తను ఎంత రహస్యంగా చేసి, వీడికి అబద్ధం చెప్పినా ఈవిషయం ఎలా తెల్సిందో!

"చెప్పమ్మా! నాన్నకూడా ఒక్కడే కదా నానమ్మకు. మొన్న మాస్నేహితుడితో పాటు వెళ్ళాను. పక్కనెవ్వరూ తోడులేక, చలికి చినిగిన దుప్పటితో మందులు సరిగా లేక, ఆస్మా ఎక్కువై నన్ను చూస్తూనే వలవలా ఏడ్చింది నానమ్మ.

చెప్పు. నానమ్మనెందుకు పంపావక్కడికి?" అరిచాడు.

"అది కాదురా!" నచ్చచెప్పబోయాడు రాజేశ్వర్రావ్.

"అసలు అమ్మ ఆ వెధవపని చేస్తుంటే నువ్వెలా ఒప్పుకున్నావ్ నాన్నా!

ఇక మాటలనవసరం. నాపెళ్ళయ్యాక ఎలాగూ మనకీ ఇల్లు చాలదు. మాకూ ఇబ్బంది. మీరు కూడా అలాంటిచోటికే వెళ్ళురుగాని సంతకం పెట్టండి" కఠినంగా అన్నాడు నరేష్.

ఏడవటం ప్రారంభించింది శారదమ్మ.

"ఏమ్మా! కొడుకు మెడబట్టి గెంటేసేందుకు సంతకం పెట్టమని అడిగితే ఏడుపొస్తుందా!

"నువ్వు మెడపట్టి గెంటేసేటపుడు మన నాన్నమ్మ ఎంతక్షోభ పడివుండాలి. ముసలిది అన్న జాలన్నా లేకుండా తీస్కెళ్ళి అనాథశరణాలయంలో చేర్పిస్తావా!

"అదే పని నీకు ఎదురయ్యేసరికి ఏడుపొస్తుంది కదూ!" వ్యగ్యంగా అన్నాడు నరేష్.

"ఒరేయ్. మమ్మల్ని అనాథలను చేయొద్దురా! కావాలంటే నాన్నమ్మను వెనుకకు పిల్చుకొచ్చేయ్. క్షమాపణ అడుగుతాను. మమ్మల్ని మాత్రం అనాథలను చేయకురా కన్నా!" నరేష్‌ను పట్టుకొని ఏడుస్తూ చెప్పింది శారదమ్మ.

ఒక్కక్షణం జాలేసింది నరేష్‌కు. "ఛ ఇదంతా నిజమని నమ్మేవా అమ్మా! నాన్నమ్మను వెనుకకు పిల్చుకురావాలని నేను ఆడిన చిన్న డ్రామా, అంతే" అని చెప్పబోయాడు. కానీ చెప్పలేదు.


మీ కుటుంబానికంతా రుచికరమైన
పలహారము నిమిషములో



వాలెస్
సేమియా
మరియు పాయసము
మొదలగు వాటికి
ఆదర్శప్రాయమయినది

Distributors for Andhra Pradesh:
SEETHARAM AGENCIES
1-2-54/5 SUMITRA SADAN OPP. DOMALGUDA MARKET HYDRABAD 500 029

SUBHA